సాక్షి విశాఖపట్నం

గురువారం । 31 । అక్టోబర్ । 2024



ఉత్సాహంగా ఐక్యతా ర్యాలీ

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా బుధవారం నిర్వహించిన ఐక్యతా ర్యాలీ ఉత్సాహంగా కొనసాగింది. 8లో



పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. 8లో



లైసెన్సులు తప్పనిసరి 8లో

బాలల సంరక్షణ కేంద్రాలన్నీ లైసెన్స్‌లు పొందాల్సిందేనని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం సూచించారు.



జనంతో కళకళలాడుతున్న పూర్ణామార్కెట్



దిష్టి గుమ్మడికాయలు విక్రయిస్తున్న వ్యాపారులు



జగదాంబ జంక్షన్ వద్ద కుమ్మరి వీధిలో మట్టి ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు



ఆనంద రవళి దీపావళి

దీపం జ్యోతిః పరబ్రహ్మ
దీపం సర్వ తమోపహమ్
దీపేన సాధ్యతే సర్వం
సంధ్యా దీపం నమోస్తుతే



మార్కెట్‌కు జోష్



నగరంలో దీపావళి పండగ సందడి నెలకొంది. పూజ, అలంకరణ వస్తువులు, టపాసులు, నూతన వస్త్రాల కొనుగోళ్లతో వ్యాపార సంస్థలన్నీ కళకళలాడాయి. పూర్ణామార్కెట్ సందడిగా మారింది. వినియోగదారులు వారికి కావాల్సిన పూజా సామగ్రితోపాటు ఇతర వస్తువులు కొనుగోలుకు మార్కెట్‌కు తరలివచ్చారు. ప్రమిదలు, పూజా సామగ్రి, పువ్వులు, చెరుకులు, కలగూరలు, పత్రుల దుకాణాలు అధికంగా వెలిశాయి. పువ్వులు, పత్రులను అధిక ధరకు విక్రయించారు. వివిధ ఆకృతుల ప్రమిదలు ఆకట్టుకున్నాయి. లక్ష్మీ పూజలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేశారు. ఏయూ, ఏఎస్ రాజా మైదానాలతో పాటు పలు చోట్ల బాణసంచా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. టపాసులను కొనుగోలు చేసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో రావడంతో **ఆయా చోట్ల** సందడి నెలకొంది. రైతుబజార్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఇలా మార్కెట్లో ఎక్కడ చూసినా దీపావళి శోభ కనిపించింది.





ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో బాణసంచా విక్రయాలు

న్యూస్‌రీల్

నగర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు



దాబాగార్డెన్స్: రంగు రంగుల దీపాలతో హరిత, స్వచ్ఛ, శుభ దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నగర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. బాణసంచా కాల్చడం వల్ల వాయు, శబ్ద కాలుష్యం పెరుగుతుందన్నారు. ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందులు కలగకుండా.. అందమైన దీపాలను ప్రతి ఇంటా వెలిగించి హరిత దీపావళిని జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.7 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి హుండీ ఆదాయం 30 రోజులకు గానూ రూ.1,70,22,443 వచ్చినట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహగిరిపై యాత్రికాసదన్‌లో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రూ.1,63,37,000 కరెన్సీ నోట్ల రూపంలో, రూ.6,85,443 చిల్లర నాణేల రూపంలో కలిపి మొత్తం రూ. 1,70,22,443 వచ్చినట్టు ఈవో వెల్లడించారు. అలాగే 57.900 గ్రాముల బంగారం, 10 కిలోల 130 గ్రాముల 500 మిల్లీగ్రాముల వెండి లభించిందన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు సన్మానం



ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందితో సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: నగర పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన ఏడుగురు సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి బుధవారం సన్మానించారు. ఆఫీస్ సూపరింటెండెంట్ కె.ఎస్.ఎన్.రెడ్డి, ఆర్ఎస్ఐ కె.సంజీవరావు, ఏఆర్ఎస్ఐ ఎ.చంద్రశేఖరరావు, ఏఎస్ఐలు జె.రవికుమార్, కె.అప్పారావు, పి.ఆర్.ప్రసాద్, ఏఆర్ హెచ్‌సీ కె.ఎల్.ఎన్.శాస్త్రి సుదీర్ఘ కాలం విధులు నిర్వర్తించి బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. వీరిని సీపీ తన కార్యాలయానికి ఆహ్వానించి కుటుంబ సభ్యులు, పోలీస్ అధికారుల సమక్షంలో శాలువాతో సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖలో 40 ఏళ్లకు పైగా విధులు నిర్వర్తించడం గొప్ప విషయమన్నారు.

వేడుకలో వసూళ్లకు తెర

- అనుమతుల పేరుతో పన్నుల శాఖ దోపిడీ
- కమర్షియల్ ట్యాక్స్ సర్కిళ్ల వారీగా రూ. లక్షల్లో వసూళ్లు
- సర్కిల్‌కు ఒకరిని నియమించి దందా సాగించిన వైనం
- సర్కారు ఖజానాకు గండి కొట్టి.. జీఎస్టీ బృందాల పండగ
- కనిపించని నాణ్యమైన బాణసంచా..



సాక్షి, విశాఖపట్నం: చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీక దీపావళి. ఈ రోజున చిన్నా పెద్ద తేడా లేకుండా దివ్యకాంతుల మధ్య.. బాణసంచా కాల్చుతూ.. ఆనందంగా పండగను జరుపుకుంటారు. కానీ.. కొన్ని ప్రభుత్వ విభాగాల సిబ్బంది, అధికారులకు మాత్రం టపాసుల అమ్మకాలకు అనుమతులిచ్చినప్పుడే దీపావళి వచ్చేసింది. నగర పరిధిలో బాణసంచా విక్రయాల కోసం జీవీఎంసీ, రెవెన్యూ, అగ్నిమాపకశాఖ, విద్యుత్, పోలీస్ శాఖలకు చెందిన అధికారులతో కూడిన కమిటీ అనుమతులిచ్చింది. అనుమతుల పేరుతో కూటమి ఎమ్మెల్యే అక్రమ వసూళ్ల పర్వం కలకలం రేపిన సంగతి తెలిసిందే.. మరోవైపు వాణిజ్య పన్నుల విభాగం కూడా హోల్‌సేల్‌గా అనధికార వసూళ్లు చేపట్టి.. అంతిమ విజయం అడ్డగోలు వసూళ్లదే అని నిరూపించింది. మొత్తానికి బాణసంచా స్టాళ్ల అనుమతుల పేరుతో ప్రభుత్వానికి వచ్చేది గోరంత అయితే.. వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, సిబ్బంది జేబుల్లోకి మాత్రం లక్షల రూపాయలు చేరినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంకోవైపు నాణ్యమైన కంపెనీకి చెందిన బాణసంచా అమ్మకాలు జరగకపోవడంతో.. బీగ్రేడ్ టపాసులతోనే వైజాగ్ వాసులు దీపావళి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సర్కిళ్ల వారీగా వసూళ్లు..!

దీపావళి స్టాళ్ల అనుమతుల ప్రక్రియలో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ తామేం తక్కువ తినట్లేదన్నట్లుగా వ్యవహరించింది. స్టాళ్లలో తాత్కాలిక విక్రయదారులు కాబట్టి.. వారికి డీలర్‌షిప్ ఉండదు. వీరందరికీ అడ్వాన్స్‌డ్ లైసెన్స్‌లను జారీ చేస్తారు. ఎంత ధరకు చెందిన బాణసంచా విక్రయిస్తారో.. దానికి 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఆ మొత్తాన్ని అడ్వాన్స్‌గా ప్రతి స్టాల్ యజమాని కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయానికి చెల్లిస్తుంటారు. అంటే రూ.లక్షకు రూ.18 వేలు చొప్పున ట్యాక్స్ వసూలు చేస్తారు. విక్రయాలు ముగిసిన తర్వాత ఎంత సరకు విక్రయించారో లెక్కలు చూపించి.. అదనంగా అమ్మితే మిగిలిన ట్యాక్స్ చెల్లించాలి. అడ్వాన్స్ ట్యాక్స్ కంటే తక్కువకు విక్రయిస్తే.. తిరిగి స్టేట్ ట్యాక్స్ అధికారులు స్టాల్ యజమానికి డబ్బులు చెల్లిస్తారు. ఇక్కడే కొందరు సిబ్బంది ముందుగానే స్టాల్ యజమానులతో కుమ్మక్కైనట్లు తెలిసింది. ఎంత బాణసంచా విక్రయించినా.. కొంత ట్యాక్స్ చెల్లిస్తే చాలు అన్నట్లు ఒప్పందం చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకోసం డివిజన్ కార్యాలయంలోని ఓ అధికారి ఆదేశాలతో సర్కిళ్ల వారీగా వసూళ్ల కోసం ఒక్కొక్కరిని నియమించుకున్నట్లు తెలుస్తోంది. ఆ ఉద్యోగి ప్రతీ వ్యాపారి వద్దకు వెళ్లి.. జీఎస్టీ లెక్క కట్టడం, కట్టాల్సింది ఇంత.. ఇందులో కొంత ప్రభుత్వానికి కట్టి.. మరికొంత మాకు సమర్పిస్తే, మీకు ఇంత లాభం మిగులుతుంది. అని లెక్కలతో సహా వివరించినట్లు సమాచారం. దాని ప్రకారం హోల్‌సేల్‌గా వసూలు చేసి.. సర్కిళ్ల వారీగా పంపకాలు జరిపినట్లు తెలుస్తోంది. ఇలా విభిన్న విభాగాలకు చెందిన పలువురు సిబ్బంది బాణసంచా అనుమతులు పేరుతో అడ్డగోలు వసూళ్లు చేసి.. దీపావళి పండగ చేసుకున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నాణ్యమైన సరకు ఎక్కడ?

బాణసంచా అమ్మకాల్లో రెండు కీలకమైన కంపెనీలు దేశంలోనే నంబర్‌వన్‌గా ఉన్నాయి. దాదాపు వాటినే ఎక్కువగా కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తుంటారు. కానీ నగరంలో ఏ స్టాల్‌ను సందర్శించినా.. అందుకు భిన్నమైన బ్రాండ్ల బాణసంచా కనిపిస్తోంది. నంబర్ వన్ కంపెనీలకు చెందిన బాణసంచా కూడా నకిలీ ప్యాకింగ్‌తో ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్లో బ్రాండ్ పేరుతో విక్రయించిన వాటిలో 90 శాతం వరకు బీ గ్రేడ్ కంపెనీకి చెందిన టపాసులే అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో వేల రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన టపాసులు సరిగా పేలుతాయా.. లేదా అనే సందిగ్ధంలో కొనుగోలుదారులు ఉన్నారు.

• పెన్సిల్ మొనపై ప్రమిద





పెన్సిల్ మొనపై ప్రమిద రూపాన్ని చెక్కి అబ్బురపరిచాడు పెదగంట్యాడకు చెందిన ఓ యువకుడు. జీవీఎంసీ 73వ వార్డు వుడా కాలనీకి చెందిన సయ్యక్ బషీర్ బాబా బి.టెక్ చదువుతున్నాడు. సిద్ధేశ్వరానికి చెందిన అతని స్నేహితుడు ద్వారపూడి మధు సుద్దముక్కలు, పెన్సిల్, బియ్యపు గింజలపై వివిధ రకాల ఆకృతులను రూపొందించాడు. వాటిపై ఆసక్తి పెంచుకున్న బషీర్ బాబా ఖాళీ సమయంలో స్నేహితుడి వద్ద ఈ కళలో మెలకువలు నేర్చుకున్నాడు. స్నేహితుడి తండ్రి కార్పెంటర్. ఆయనకు చెందిన పనిముట్లతో దీపావళి నేపథ్యంలో ప్రమిదను రూపొందించి ప్రశంసలు అందుకున్నాడు. - పెదగంట్యాడ

దీపావళి.. వెలుగులు నింపాలి

సీపీ శంఖబ్రత బాగ్చి



పోలీస్ అధికారులకు సూచనలిస్తున్న సీపీ బాగ్చి

విశాఖ సిటీ: ప్రజలందరూ సరైన జాగ్రత్తలు పాటిస్తూ ఆనందోత్సాహాలతో దీపావళి పండగను జరుపుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. నగరంలో ఏర్పాటు చేసిన పలు బాణసంచా దుకాణాల వద్ద భద్రతా ప్రమాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. స్టాళ్ల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా తగిన భద్రత చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

జాగ్రత్తగా టపాసులు కాల్చాలి : ఈ దీపావళి నగర ప్రజల జీవితాల్లో కాంతులు నింపాలని సీపీ ఆకాంక్షించారు. సరైన జాగ్రత్తలు పాటిస్తూ బాణసంచా కాల్చాలని, పిల్లల పట్ల తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. చిన్న పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు తప్పనిసరిగా పెద్ద వాళ్ల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. కాటన్ దుస్తులు ధరించాలన్నారు. ఇంటి లోపల బాణసంచా కాల్చకూడదని, టపాకాయలు చేతిలో పట్టుకుని కాల్చవద్దన్నారు. రోడ్లపై వెళ్లే వాహనచోదకులు, ప్రజలకు ఇబ్బంది లేకుండా బాణసంచా సామగ్రి కాల్చాలన్నారు.

కాలుష్య నియంత్రణ చర్యలపై ఆరా

జిందాల్, మరిడి ప్లాంట్‌లు సందర్శించిన ఏపీపీసీబీ చైర్మన్ కృష్ణయ్య



జిందాల్ ప్లాంట్ ప్రతినిధులను ప్రశ్నిస్తున్న ఏపీపీసీబీ చైర్మన్ కృష్ణయ్య

మధురవాడ: పరిశ్రమల్లో కాలుష్య నియంత్రణ, దాని కోసం చేపడుతున్న చర్యలపై ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య ఆరా తీశారు. బుధవారం మధురవాడ జోన్-2 పరిధిలోని కాపులుప్పాడ డంపింగ్ యార్డును ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిందాల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌లో యాజమాన్య ప్రతినిధులు, జీవీఎంసీ అధికారులతో సమావేశమయ్యారు. డంపింగ్ యార్డులోని జిందాల్‌తో పాటు ఇతర సంస్థలు కాలుష్య నివారణకు చేపడుతున్న చర్యలు, వ్యర్థాలు ఎక్కడ నుంచి ఏయే పద్ధతుల ద్వారా తీసుకువస్తున్నారు తదితర అంశాలపై ఆరా తీశారు. అక్కడ దుర్వాసన వెలువడుతుండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్షం నీరు నిల్వ ఉండడం వల్ల దుర్వాసన వస్తోందని అధికారులు చెప్పగా ఇటువంటి కారణాలు చెప్పవద్దన్నారు. జిందాల్ ప్లాంట్‌లో మొక్క నాటారు. అనంతరం మరిడి ఎకోని సందర్శించారు. ఇక్కడకు ఏ రకమైన వ్యర్థాలు, ఎక్కడ నుంచి తెస్తున్నారు. నిల్వ ఉంచే పద్ధతులు, ఉత్పత్తి చర్యల్లో ఎంత మంది కార్మికులను ఉపయోగిస్తున్నారు. వారికి కల్పిస్తున్న రక్షణ చర్యలు తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సదరు ప్రతినిధులు మాట్లాడుతూ తాము 650 ఆస్పత్రులు, క్లినిక్‌లు, ఇతర ప్రాంతాల నుంచి వ్యర్థాలు తీసుకుంటున్నామని, కొన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వ్యర్థాలు సక్రమంగా ప్రాసెస్ చేయడం లేదని చెప్పారు. కార్యక్రమంలో జీవీఎంసీ చీఫ్ హెల్త్ ఆఫీసర్ నరేష్, ఈఈ దిలీప్‌కుమార్, ఎస్ఈ గోవిందరాజులు, జెడ్సీ సింహాచలం, ఏపీపీసీబీ డీఈ రమేష్ పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ హరేందిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు నవంబర్ రెండో తేదీన జిల్లాలో పర్యటిస్తారని, ఇందుకు సంబంధించి పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఒకటో తేదీన సీఎం చంద్రబాబు శ్రీకాకుళం పర్యటన ముగించుకుని రెండో తేదీ ఉదయం ఎస్.కోట ప్రాంతంలో పర్యటిస్తారన్నారు. మధ్యాహ్నం విశాఖ కలెక్టరేట్‌లో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో శాంతి భద్రతలు, పారిశుద్ధ్య చర్యలు తదితర అంశాలపై సంబంధిత అధికారులకు సూచనలిచ్చారు. ముఖ్యమంత్రి ప్రయాణించే దారిలో రోడ్లపై బ్యానర్లు, విద్యుత్ తీగలు, పోస్టర్లు తొలగించాలన్నారు. సీఎం పర్యటనకు సంబంధించి పర్యవేక్షణ అధికారిగా జేసీ వ్యవహరిస్తారన్నారు. జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవోలు సంగీత్ మాధుర్, పి.శ్రీలేఖ పాల్గొన్నారు.

100 రోజుల ప్రణాళికపై సమీక్ష

ముఖ్యమంత్రి అభివృద్ధి ప్రాజెక్టులు, 100 రోజుల ప్రణాళిక తదితర అంశాలపై సమీక్షిస్తారని కలెక్టర్ తెలిపారు. ఆయా శాఖల పరిధిలో ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులు, 100 రోజుల ప్రణాళికలో చోటు కల్పించిన అంశాలు, ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాలోని అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

3న స్విమ్మింగ్ జట్ల ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: జిల్లా సబ్ జూనియర్, జూనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నవంబర్ 3న అక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరగనున్నాయి. విశాఖ జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో ఆయా అంశాల్లో విజేతలను జిల్లా జట్టుగా అంతర జిల్లాల పోటీలకు పంపనున్నారు. మూడు గ్రూప్‌ల్లో ఐదు అంశాల్లో పోటీలు నిర్వహించనున్నామని సంఘం కార్యదర్శి మోహన్‌రామ్ తెలిపారు. ఒకటో తేదీలోగా రూ.150లు ప్రవేశ రుసుం చెల్లించి పేర్లను fms.swimming.org.inలో నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు విశాఖ వేదికగానే జరగనున్న అంతర జిల్లాల అక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించనున్నారు.

నేడు సింహగిరిపై నరకాసురవధ

సింహాచలం: నరక చతుర్దశి, దీపావళి పురస్కరించుకుని గురువారం సింహగిరిపై నరకాసురవధ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రాత్రి ఆరాధన అనంతరం ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. నరకాసురుడి విగ్రహాన్ని ఒక పల్లకీలో, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను మరో పల్లకీలో అధిష్ఠింపజేస్తారు. సింహగిరి మాడవీధిలో ఎదురెదురుగా ఉంచి నరకాసుర వధ ఉత్సవం నిర్వహిస్తారు. యుద్ధ సన్నివేశాలు, నరకాసురవధ ఘట్ట విన్నపం పూజలు చేస్తారు. ఆ తర్వాత పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తారు. కాగా.. గురువారం సాయంత్రం 5 గంటల వరకే స్వామి దర్శనాలు లభిస్తాయని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు.

గాజువాక జోన్‌లో ఒకే ఒక్కడు

- నీటి సరఫరా విభాగం ఏఈలందరూ బదిలీ
- ఒకే ఏఈకి 20 వార్డుల బాధ్యతలు



10 ఎంజీడీ వాటర్ ప్రాజెక్టు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్ నీటి సరఫరా విభాగంలో సహాయ ఇంజనీర్ల బదిలీలో వింత చోటుచేసుకుంది. 20 వార్డులు, 5 లక్షల మంది జనాభా, 60వేల నీటి కుళాయి కనెక్షన్లు ఉన్న గాజువాక జోన్‌లో ఆ విభాగం మొత్తానికి ఒకే ఒక ఏఈని ఉంచి మిగిలినవారిని బదిలీ చేసేశారు. ఇది ఆ విభాగంలో సిబ్బందిని సైతం విస్మయానికి గురి చేసింది. దీని వెనుక భారీ పైరవీలు, కూటమికి చెందిన ఇద్దరు కార్పొరేటర్ల ఒత్తిడి ఉన్నట్టు సమాచారం. గాజువాకలో మొత్తం నాలుగు నీటి సరఫరా ప్రాజెక్టులున్నాయి. 10 ఎంజీడీ, 2 ఎంజీడీ వాటర్ ప్రాజెక్టులు సుందరయ్య కాలనీ వద్ద, 85 ఎంఎల్‌డీ వాటర్ ప్రాజెక్టు అగనంపూడిలోను, 2.65 ఎంజీడీ వాటర్ ప్రాజెక్టు సిద్ధార్థనగర్‌లోను, 1 ఎంజీడీ వాటర్ ప్రాజెక్టు షీలానగర్‌లోను ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 60 వేల కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. ఈ మొత్తం ప్రాజెక్టులను పర్యవేక్షించడానికి గతంలో నలుగురు సహాయ ఇంజనీర్లు పని చేయగా కొన్నిరోజుల క్రితం ముగ్గురు సహాయ ఇంజనీర్లు పనిచేశారు. తాజాగా వారిలో ఇద్దరు సహాయ ఇంజనీర్లను బదిలీ చేశారు. ప్రస్తుతం జోన్ మొత్తానికి ఒకే ఒక ఏఈని ఉంచారు. దీనిపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ముగ్గురు ఏఈలు ఉన్నప్పుడే ప్రతి రోజు సమస్యలు చోటు చేసుకున్న పరిస్థితులున్న నేపథ్యంలో ఒకే ఒక్క ఏఈతో సేవలు ఎలా అందుతాయన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

మిగతా జోన్లలో ఇలా..

జీవీఎంసీ పరిధిలోని జోన్-2లో ముగ్గురు ఏఈలు, జోన్-3లో ముగ్గురు, జోన్-4లో ఇద్దరు, జోన్-5లో ముగ్గురు, జోన్-7లో ఇద్దరు ఏఈలు ఉన్నారు. ఒక్క గాజువాక జోన్‌లోనే ఈ విధంగా బదిలీ చేయడం విమర్శలకు తావిస్తోంది. ఇంత పెద్ద జోన్‌కు ఒక్క ఏఈ ఉండటం ఏమిటా అని నీటి సరఫరా సిబ్బంది సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ నిర్ణయం వెనుక టీడీపీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు కీలకపాత్ర పోషించినట్లు సమాచారం. అయితే నీటి సరఫరాలో ఉన్నతాధికారులు మాత్రం దీనికి రకరకాల కారణాలు పేర్కొంటున్నారు.

అస్తవ్యస్తంగా నీటి సరఫరా వ్యవస్థ

ప్రస్తుతం గాజువాక జోన్‌లో నీటి సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్న విషయం తెలిసిందే. కొన్ని వార్డుల్లో రోజు విడిచి రోజు నీటి సరఫరా సాగుతోంది. మరికొన్ని వార్డుల్లో నీరు ఏ సమయానికి ఇస్తున్నారో తెలియని పరిస్థితి ఉంది. నిత్యం ఎక్కడోచోట లీకులు ఏర్పడి జనం అవస్థలు పడుతూనే ఉన్నారు. అందువల్ల ప్రతి ప్రాజెక్టుకు ఒక ఏఈ ఉండాల్సిన అవసరం ఉందని జోనల్ అధికారులు చెబుతూనే ఉన్నారు. అయినప్పటికీ ఉన్నతాధికారులు గాజువాక జోన్‌కు ఒకే ఒక్క ఏఈని ఉంచడం పట్ల విమర్శలు చోటుచేసుకుంటున్నాయి.

కొత్త ఏఈలను నియమిస్తాం

గాజువాక జోన్‌కు ఒక్క ఏఈ సరిపోరు. ప్రస్తుతం జరిగిన బదిలీల్లో ఇద్దరు ఏఈలను బదిలీ చేశారు. జీవీఎంసీకి తక్కువ మంది ఏఈలు వచ్చారు. అందువల్లే గాజువాకకు జోన్‌లో ప్రస్తుతం ఒక్క ఏఈని ఉంచాం. త్వరలోనే కొత్త ఏఈల నియామకం జరుగుతుంది.
-పి.కనకారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, వాటర్ సప్లయ్

కిడ్నాప్ కేసులో నలుగురి అరెస్టు

- పరారీలో మరో ముగ్గురు
- నిందితులందరూ విశాఖవారే..


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్, వెనుక ముసుగులో నిందితులు

శృంగవరపుకోట: ఎస్.కోట మండలంలో ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసిన ఘటన కలకలం సృష్టించింది. ఎస్.కోట పోలీసుల అప్రమత్తతతో బాధితుడు క్షేమంగా బయటపడ్డారు. ఎస్.కోట పోలీస్ స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్ వివరాలను వెల్లడించారు. సోమవారం ఉదయం 5.30 గంటల సమయంలో కొట్టాం గ్రామానికి చెందిన దంతులూరి సూర్యనారాయణ రాజును ఇద్దరు వ్యక్తులు వచ్చి తాము పోలీసులమని, విచారణ కోసం రావాల్సి ఉందని చెప్పి తీసుకెళ్లారు. తర్వాత ఆయన కుటుంబీకులకు ఫోన్ చేసి రూ.4 లక్షలు ఇవ్వాలని, లేకుంటే సూర్యనారాయణరాజును చంపేస్తామని బెదిరించారు. దీనిపై సూర్యనారాయణరాజు అల్లుడు కె.శివప్రసాద్ మంగళవారం రాత్రి ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం 5 గంటల సమయంలో ఎస్.కోట ఎస్ఐ ఎస్.భాస్కరరావు ఉసిరి గ్రామం వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో ఎస్.కోట వైపు వస్తున్న ఏపీ39ఎల్ఎస్4549, ఏపీ39సివి3522 నంబర్ల గల కార్లను ఆపారు. పోలీసులను చూసి అందులో ఉన్న వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి పట్టుకుని విచారణ జరపడంతో కిడ్నాప్ విషయం వెలుగుచూసింది. బాధితుడి జాడ తెలుసుకుని రక్షించి కుటుంబీకులకు అప్పగించారు. కిడ్నాప్ కేసులో ఏడుగురు నిందితులు ఉన్నారు. వీరిలో ఎ1 కసిరెడ్డి రాజు విశాఖపట్నం కొమ్మాది ప్రాంతంలోని అమరావతి కాలనీకి చెందినవాడు. అతనికి బాధితుడితో 20 ఏళ్లుగా పరిచయం ఉంది. ఆర్థిక అవసరాలతో కసిరెడ్డి రాజు తన ఇద్దరు కొడుకులు ప్రవీణ్‌కుమార్, సాయితో పాటు వారి స్నేహితులు నలుగురి సాయంతో కిడ్నాప్‌కు పథకం రచించారు. ప్రస్తుతం పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. పరారైన ముగ్గురి కోసం గాలిస్తున్నారు. కేసును ఛేదించిన ఎస్.కోట పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఎస్పీతో పాటు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ ఎస్.వి.నారాయణమూర్తి, ఎస్ఐ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలి

- భర్త, అత్తమామ, బావ, తోడికోడలు అరెస్టు

అగనంపూడి : అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన 88వ వార్డు మంగళపాలెం జేఎస్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని జాలారిపేటకు చెందిన పీతల ఈశ్వరరావు, సూర్యలక్ష్మిల కుమార్తె చిన్ని దివ్యశ్రీ (19)కి మంగళపాలెం జేఎస్ఎన్‌యూఆర్‌ఎం కాలనీకి చెందిన శరత్‌కుమార్‌తో ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. పెళ్లినాటి నుంచి అదనపు కట్నం కోసం అత్తమామలు సత్య, అప్పారావులు వేధిస్తున్నారని ఎప్పటికప్పుడు దివ్య తల్లిదండ్రులకు చెబుతుండేది. ఇదిలా ఉండగా దివ్యశ్రీ నాలుగు నెలల క్రితం బాబుకు జన్మనిచ్చింది. గత నెలలో బాబును తీసుకొని దివ్యశ్రీ అత్తారింటికి వెళ్లగా మళ్లీ వేధింపులు ప్రారంభమయ్యాయి. భర్త, అత్తమామ, బావ, తోడికోడలు తనను ఒంటరిని చేసి వేధిస్తున్నారని కన్నవారి వద్ద దివ్యశ్రీ విలపించేది. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో దివ్యశ్రీ తమకు ఫోన్ చేసి వీళ్లంతా తనను వేధిస్తున్నారని, ఏమి చేస్తారో భయంగా ఉందని, తాను బతకనని చెప్పి ఫోన్ కట్ చేసిందని దివ్యశ్రీ తల్లిదండ్రులు సూర్యలక్ష్మి, ఈశ్వరరావు తెలిపారు. వెంటనే ఆమెకు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో అత్తింటి వారికి చేశామని, వారు కూడా లిఫ్ట్ చేయలేదని వారు పేర్కొన్నారు. సాయంత్రం 3.30 గంటల సమయంలో అత్త సత్య ఫోన్ చేసి దివ్యశ్రీ ఆత్మహత్య చేసుకుందని ఫోన్ చేసి చెప్పిందని బోరున విలపించారు. సంఘటన స్థలానికి చేరుకున్న దివ్యశ్రీ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణ అనంతరం పోలీసులు.. అత్తమామ, భర్త, బావ, తోడికోడలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు విచారణలో ఉంది.


దివ్యశ్రీ మృతదేహం



ఆనందంగా దీపావళి..
కాస్త జాగ్రత్తగా.!

- ప్రమోదం.. కాకూడదు ప్రమాదం
- కాలుష్యం నుంచి మాస్కులతో రక్ష
- వెలుగుల పండక్కి నగరం సిద్ధం

మహారాణిపేట: దీపావళి పండగను జరుపుకునేందుకు నగరం సిద్ధమైంది. దీపావళి అంటే ప్రతీ మదిలో మెదిలేది టపాసులు.. క్రాకర్స్.. చిచ్చుబుడ్డి వెలుగులు. గతంలో పిండి వంటలు చేసుకుని.. మట్టి దీపాలతో దివిటీలు తిప్పుతూ పండగ జరుపుకునేవారు. ఇవి ప్రకృతికి పెద్దగా నష్టం కలిగించేవి కాదు. నేడు మనం పండగ చేసుకునే తీరు ప్రకృతి వనరులు, చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధిగ్రస్తులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నో జాగ్రత్తలతో పండగ జరుపుకోవాల్సిన అవసరం ఏర్పడింది. వాయు కాలుష్యం హృదయ, శ్వాసకోశ వ్యాధులను తీవ్రతరం చేస్తుంది. గుండె, ఊపిరితిత్తులపై ప్రభావితం చూపుతుంది. గుండెపోటుకు దారి తీసే అవకాశం ఉంది. అందుకే ముందు జాగ్రత్తగా దీపావళి రోజు మాస్కులు ధరించి టపాసులు కాల్చాలని వైద్యులు సూచిస్తున్నారు. పర్యావరణ కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకున్న కొన్ని సంస్థలు యాంటీ పొల్యూషన్ మాస్కులను విరివిగా విక్రయిస్తున్నాయి.

టపాసులు కాల్చేటప్పుడు..

బాణసంచా కాల్చేటప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యం చూపినా పెను ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది. అవి మిగిల్చిన చేదు జ్ఞాపకాలు జీవితాంతం వెంటాడుతూనే ఉంటాయి. అందుకే వినియోగదారులు నాణ్యమైన పటాసులు మాత్రమే కొనుగోలు చేయాలి. ఆయిల్ క్యాన్లు, గ్యాస్ సిలిండర్లు, తదితర మండే పదార్థాలకు దూరంగా టపాసులు కాల్చాలి. పైకి ఎగిరే తారాజువ్వలను గడ్డికుప్పలు, పూరి గుడిసెలకు దూరంగా కాల్చాలి. పెద్దల పర్యవేక్షణలో పిల్లలు బాణసంచా కాల్చడం ఉత్తమం. సరిగ్గా కాలని వాటిని మళ్లీ వెలిగించడం, ఊదడం చేయకూడదు. తక్కువ శబ్దం వచ్చే వాటిని ఎంచుకోవాలి. పేలుడు పదార్థాలను పిల్లలకు దూరంగా ఉంచాలి. కాల్చేటప్పుడు నీటిని అందుబాటులో ఉంచుకోవాలి. చేతిలో టపాసులు కాల్చడం, వెలిగించి విసిరి వేయడం వంటివి చేయకూడదు.

అగ్నిమాపక కేంద్రాల నంబర్లు

సూర్యాబాగ్, సిటీ	0891-2563582
బర్మాక్యాంపు, సిటీ	0891-2558470
పెదగంట్యాడ	0891-2517780
చిట్టివలస	08933-201337
సబ్బవరం	08924-248799



అత్యవసర నంబర్లు

108: ఎవరైనా గాయపడితే వెంటనే 108కు ఫోన్ చేయాలి.

101: అగ్ని ప్రమాదం జరిగితే అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం అందించాలి.

100, 112: అత్యవసర సమాచారం ఏదైనా ఈ నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలి.

ఎవరూ గాయాలపాలు కావద్దు



టపాసులు కాల్చే సమయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా గాయాలపాలవుతాం. ఆ సమయంలో త్వరగా మండే స్వభావం ఉన్న సింథటిక్ దుస్తులు కాకుండా.. వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించడం మంచిది. టపాసులు, చిచ్చుబుడ్లు వెలిగించిన తర్వాత అవి సరిగా కాలుతున్నాయో లేదో అని దగ్గరగా వెళ్లి చూస్తుంటారు. ఒక వేళ ఆ టపాసులు పేలితో ముఖానికి, కళ్లకు తీవ్ర గాయాలై.. కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంది. అలా ఎవరూ చేయవద్దు. టపాసులు కాల్చే సమయంలో కళ్ల జోడు ధరించడం మంచింది. కాళ్లకు చెప్పులు లేదా షూ వేసుకోవాలి. ఏటా దీపావళి అనంతరం కేజీహెచ్‌కు 15 నుంచి 20 మంది గాయాలతో వస్తుంటారు. తగిన జాగ్రత్తలు తీసుకుని.. ఎవరూ గాయాలపాలు కావద్దు.

–డాక్టర్ టి.మోహనరావు, ప్లాస్టిక్ సర్జరీ విభాగం, కేజీహెచ్

వైఎస్సార్ సీపీతోనే మా ప్రయాణం

- 13వ వార్డు కార్పొరేటర్ సునీత


మాట్లాడుతున్న కార్పొరేటర్ కెల్ల సునీత, వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్యనారాయణ

ఆరిలోవ: 'మేం ఏ పార్టీలోనూ చేరలేదు. వైఎస్సార్ సీపీలోనే ఉన్నాం. భవిష్యత్‌లోనూ వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతాం.'అని జీవీఎంసీ 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, ఆ పార్టీ నాయకుడు కెల్ల సత్యనారాయణ స్పష్టం చేశారు. వార్డు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం కార్పొరేటర్ సునీత మాట్లాడారు. నేను, నా భర్త సత్యనారాయణ టీడీపీలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమన్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొన్ని పరిణామాల కారణంగా సైలెంట్‌గా ఉన్నామని, అంతేగానీ పార్టీ మారే ఆలోచన లేదని స్పష్టం చేశారు. మా ఇద్దరి ఫొటోలతో ఒక పత్రికలో ప్రచురితమైన దీపావళి శుభాకాంక్షల ప్రకటనలో తమ ప్రమేయం లేదన్నారు. టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఫొటోతో పాటు తమ ఫొటోలు వేయడం సరికాదన్నారు. ఈ విషయమై ఆ పత్రికా ప్రతినిధులను సంప్రదించి సవరణ కోరినట్లు చెప్పారు. వార్డులో వైఎస్సార్ సీపీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని కార్పొరేటర్ సునీత అన్నారు. అనంతరం వార్డు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

చదరంగంలో మనమే ఫస్ట్

విశాఖ విద్య: చదరంగం పోటీల్లో విశాఖ విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా, లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయం వేదికగా రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు ఈ నెల 29, 30 తేదీల్లో జరిగాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఎంపిక చేసిన 65 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. అండర్ 14 విభాగంలో విశాఖ నుంచి పాల్గొన్న బాలికల జట్టు రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. భీమరశెట్టి శ్రావ్య శ్రీ, పితాని సత్య శ్రీవిద్య, మదుపాడ మనస్వి, మోయిద దివ్యదర్శని, దివ్య కుమారి తమ సత్తా చాటారు. టీం కెప్టెన్ శ్రావ్యశ్రీ జాతీయ జట్టుకు ఎంపికైంది. అనంతపురం జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ మొరార్జి యాదవ్ విజేతలకు ట్రోఫీ బహూకరించారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ దేవుడుబాబు గెలిచిన ఆటగాళ్లను, టీం మేనేజర్ సీహెచ్ రమణారావు, కోచ్ ఎం.చిన్నను, ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు.


విజేతగా నిలిచిన జిల్లా విద్యార్థులు

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


శ్రావణ్‌కుమార్(ఫైల్)

పెందుర్తి: దీపావళి సందర్భంగా ఓ ఇంటికి విద్యుత్ అలంకరణ చేస్తుండగా షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. చినముషిడివాడ సమీపంలోని హుద్‌హుద్ కాలనీలో నివాసం ఉంటున్న తాళ్లపూడి శ్రావణ్‌కుమార్(27) స్థానికంగా ఎలక్ట్రికల్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో దీపావళి సందర్భంగా స్థానికంగా ఉండే జోగులాంబ అపార్ట్‌మెంట్ సమీపంలోని ఓ భవనానికి విద్యుత్ దీపాల అలంకరణకు ఒప్పందం చేసుకున్నాడు. బుధవారం సాయంత్రం అయా పనులు చేస్తుండగా భవనానికి సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై తన చేతిలోని వైరు పడి విద్యుదాఘాతానికి గురై భవనంపై నుంచి కింద పడిపోయాడు. స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు శ్రావణ్‌కు భార్య కుమార్తె ఉండగా ప్రస్తుతం విభేదాల కారణంగా విడిగా ఉన్నట్లు తెలిసింది. శ్రావణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. పెందుర్తి సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా ఐక్యతా ర్యాలీ

బీచ్ రోడ్డు: భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా బుధవారం నిర్వహించిన ఐక్యతా ర్యాలీ ఉత్సాహంగా కొనసాగింది. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనా కూడలి నుంచి సర్క్యూట్ హౌస్ వద్ద గల పటేల్ జంక్షన్ వరకు సాగిన రన్ ఫర్ యూనిటీ(ఐక్యత) ర్యాలీని శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. పోలీసు అధికారులు, సిబ్బంది ర్యాలీలో పాల్గొని.. అందరిలో ఐక్యతా స్ఫూర్తిని నింపారు. అనంతరం పటేల్ జంక్షన్ వద్ద ఉన్న ఉక్కు మనిషి విగ్రహానికి సీపీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నేటి యువత పటేల్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని.. అహింసా సిద్ధాంతాలతో ముందుకు నడవాలన్నారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో దేశ ఐక్యతకు, అంతర్గత భద్రతకు కట్టుబడి ఉంటామని ప్రమాణం చేయించారు.

కుటుంబ కథా చిత్రమ్ 'ధూంధాం'


మీడియాతో మాట్లాడుతున్న చిత్ర యూనిట్, బీజేపీ నాయకుడు చెరువు రామకోటయ్య

మద్దిలపాలెం: లవ్, ఫ్యామిలీ, యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ధూం ధాం' చిత్ర బృందం బుధవారం నగరంలో సందడి చేసింది. చేతన్ కృష్ణన్, హెబ్బాపటేల్ జంటగా సాయికిశోర్ మచ్చా దర్శకత్వం వహించిన ఈ సినిమా ప్రీమియర్ షోను మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో ప్రదర్శించారు. షో అనంతరం చిత్ర నిర్మాత ఎం.ఎస్.కుమార్ మీడియాతో మాట్లాడారు. 'ధూం ధాం' నవంబర్ 8న విడుదల కానుందన్నారు. కాకినాడ, హైదరాబాద్‌తో పాటు పోలాండ్ దేశంలో షూటింగ్ చేశామని, చిన్న సినిమాలో ఎందరో పెద్ద నటులు ఉన్నారన్నారు. ఢీ, వెంకీ, దూకుడు సినిమాల రచయిత గోపీమోహన్ ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే అందించారన్నారు. కుటుంబ ప్రేక్షకుల ఆదరణ పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దర్శకుడు మాట్లాడుతూ గతంలో జేమ్స్ బాండ్ సినిమా తీసినట్లు చెప్పారు. నా సామిరంగా దర్శకుడు విజయ్ బెన్ని కొరియోగ్రాఫర్‌గా చేసిన ఆఖరి సినిమా ఇదే అని, ఈ చిత్రంలో విజయ్ బెన్ని నృత్యాలు ఆకట్టుకుంటాయని తెలిపారు. హీరోయిన్ హెబ్బా పటేల్ నటన హైలైట్ అవుతుందన్నారు. నటుడు నవీన్ మాట్లాడుతూ అల్లుడు శ్రీను సినిమాలో విలన్ కొడుకుగా, విశ్వం సినిమాలో టెర్రరిస్ట్ పాత్రలో నటించినట్లు గుర్తు చేశారు. చిత్ర కథా రచయిత గోపీమోహన్ మాట్లాడుతూ అందరూ చూడదగ్గ సినిమా అని, వినోదం కొత్తగా ఉంటుందని తెలిపారు. బెనర్జీ, వెన్నెల కిశోర్, శ్రీనివాస్, గోపరాజు పాత్రలు బాగా పండాయన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు చెరువు రామకోటయ్య మాట్లాడుతూ సినిమా ప్రివ్యూ షో చూసిన తర్వాత నిజంగా 'ధూం ధాం' అన్నట్టుగా ఉందని, తండ్రీకొడుకుల ప్రేమ కథ దీపావళి ముందు రావడం సంతోషకరం అని అన్నారు. విశాఖకు చెందిన హీరో చేతన్ కృష్ణన్ బాగా నటించాడని కొనియాడారు. సినిమా విజయవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన

మహారాణిపేట: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై ప్రజల్లో మరింతగా అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో విద్యుత్ శాఖ అధికారులతో బుధవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూర్యఘర్ యోజనపై ప్రజలకున్న సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి తీసుకురావాలని, కనెక్షన్ కావాలనుకునే వారికి పూర్తి సహకారం అందించాలన్నారు. సచివాలయాలు, ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పోస్టర్లు అతికించాలని ఆదేశించారు. ఇప్పటికే ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందున్న వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని మెయిన్‌స్ట్రీమ్ మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రసారం చేయాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ.. జిల్లాలో ఒక ఆదర్శ సోలార్ గ్రామాన్ని తీర్చిదిద్దాలన్నారు. వినియోగదారులు ఇతర వివరాల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించవచ్చన్నారు. జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, ఈపీడీసీఎల్ ఎస్ఈ శ్యాంబాబు, డీఈ సుమన్, ఎల్డీఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలు చేసిన ఇద్దరి అరెస్ట్

తాటిచెట్లపాలెం: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను గవర్నమెంట్ రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలివీ... జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ అబ్దుల్ మారూఫ్, ఆర్పీఎఫ్ ఎస్ఐ బర్దన్ సిబ్బందితో కలిసి బుధవారం రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫాంలలో తనిఖీలు చేశారు. 8వ నంబర్ ప్లాట్‌ఫాంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన అతి ఉర్ కబిరాజ్, షరీఫ్ హక్‌లు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి బ్యాగులను తనిఖీ చేశారు. అందులో సరైన బిల్లులు లేకుండా రవాణా చేస్తున్న రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని విచారించారు. విశాఖపట్నం జీఆర్పీ స్టేషన్‌లో నమోదైన పలు కేసులకు సంబంధించి బంగారు ఆభరణాలుగా గుర్తించారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఎస్ఐలు తెలిపారు.

మాజీ సైనికుడిపై పోక్సో కేసు

మధురవాడ: మధురవాడలోని దోబీకాలనీకి చెందిన మాజీ ఆర్మీ జవాన్‌పై పీఎంపాలెం పోలీసులు పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివీ.. కె.చిన్న అబ్రహం(58) ఆర్మీలో పనిచేశాడు. అతను బాలికలు, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడనే ఫిర్యాదులున్నాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఓ బాలిక అతని వేధింపులు భరించలేక ఏడ్చుకుంటూ తల్లిదండ్రులకు విషయం తెలియజేసింది. బాలిక తల్లిదండ్రులతో పాటు స్థానికులు అతని ఇంటి వద్దకు వెళ్లి అబ్రహంను నిలదీశారు. తర్వాత టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయడంతో పీఎంపాలెం ఎస్ఐ భాస్కరరావు అక్కడకు చేరుకున్నారు. అబ్రహం వేధింపులపై బాలికలు, మహిళలు ఎస్ఐకు వివరించడంతో అతన్ని స్టేషన్‌కు తరలించి విచారించారు. ఇద్దరు బాలికలు, ఓ మహిళపై అబ్రహం అసభ్యకరంగా మాట్లాడినట్లు ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించారు. బాధితుల్లో ఓ ఎస్సీ బాలిక ఉంది. దీంతో అతనిపై పోక్సో చట్టం కింద కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు, వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులకు సుఖవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు పలు రైళ్లకు తాత్కాలికంగా మరిన్ని అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- సంబల్‌పూర్-నాందేడ్(20809) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ 1వ తేదీ నుంచి 29వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో), నాందేడ్-సంబల్‌పూర్ (20810) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు నవంబరు 2వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 1-థర్డ్ ఏసీ ఎకానమి, 1-స్లీపర్ క్లాస్ కోచ్‌లను జతచేస్తున్నారు.
- సంబల్‌పూర్-ఈరోడ్ (08311) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ 6వ తేదీ నుంచి 27వ తేదీ వరకు, ఈరోడ్-సంబల్‌పూర్ (08312) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ 8వ తేదీ నుంచి 29వ తేదీ వరకు 1-థర్డ్ ఏసీ, 1-స్లీపర్ క్లాస్ కోచ్‌లను జతచేస్తున్నారు.
- విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్‌కు నవంబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు, కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్‌కు నవంబర్ 2వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు 1-స్లీపర్ క్లాస్ కోచ్‌ను జతచేస్తున్నారు.
- విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌కు నవంబర్ 3,10,17,24 తేదీల్లో, కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్‌కు నవంబరు 4,11,18,25 తేదీల్లో 1-విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు.
- విశాఖపట్నం-గుణుపూర్-విశాఖపట్నం(08522/08521) పాసింజర్ స్పెషల్‌కు నవంబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 1-స్లీపర్ క్లాస్ కోచ్‌ను జతచేస్తున్నారు.
- పూరీ-యశ్వంత్‌పూర్(22883) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ 1వ తేదీ నుంచి 29వ తేదీ వరకు, యశ్వంత్‌పూర్-పూరీ(22884) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ 2వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 1-థర్డ్ ఏసీ ఎకానమి కోచ్‌ను జతచేస్తున్నారు.
- విశాఖపట్నం-భువనేశ్వర్(22820) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ 5వ తేదీ వరకు, భువనేశ్వర్-విశాఖపట్నం(22819) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ 6వ తేదీ వరకు 2-జనరల్ సెకండ్ సిటింగ్ కోచ్‌లను జతచేస్తున్నారు.
- విశాఖపట్నం-కోరాపుట్ (18512) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు, కోరాపుట్-విశాఖపట్నం(18511) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ 2వ తేదీ నుండి 5వ తేదీ వరకు 2-జనరల్ సెకండ్ సిటింగ్ కోచ్‌లను జతచేస్తున్నారు.
- విశాఖపట్నం-బ్రహ్మపూర్(18526) ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ 4వ తేదీ వరకు, బ్రహ్మపూర్-విశాఖపట్నం(18525)ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 30 నుంచి నవంబర్ 5వ తేదీ వరకు 1-జనరల్ సెకండ్ సిటింగ్ కోచ్‌ను జతచేస్తున్నారు.

బాలల సంరక్షణ కేంద్రాలకు లైసెన్సులు తప్పనిసరి

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం

ఎంవీపీకాలనీ: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బాలల సంరక్షణ కేంద్రాలన్నీ లైసెన్సులు పొందాల్సిందేనని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. ఇందుకు అనుగుణంగా ఆయా జిల్లాల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం ఎంవీపీ కాలనీలోని స్త్రీ, శిశు సంక్షేమం, సాధికారత శాఖ కార్యాలయంలో స్త్రీ, శిశు సంక్షేమంతో పాటు బాలల సంక్షేమం, వీధి బాలల సంక్షేమ శాఖ, సంస్కరణల సేవలు, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని బాలల సంరక్షణ కేంద్రాలు జువైనల్ జస్టిస్ చట్టం 41 ప్రకారం లైసెన్సులు పొందాలన్నారు. లైసెన్స్‌ల నమోదుకు ముందుకురాని కేంద్రాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో అన్ని జిల్లాల ఉన్నతాధికారులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా బాలల సంరక్షణాధికారి బీహెచ్ లక్ష్మి, పీవోఎస్ ఐసీబీ మమత, లీగల్ అండ్ ప్రొబేషనరీ అధికారి ఐ.అనీజాకుమారి, సోషల్ వర్కర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ A.P. ఓపెన్ స్కూల్ 10th, 12th, ఆంధ్రా, నాగార్జున యూనివర్శిటీల నుండి డిస్టెన్స్ B.A. B.Com, B.Sc, MA, M.Com, M.Sc, MBA, MCA లకు పాస్ గ్యారంటీ గైడెన్స్. ఫోన్ : 99668 48898 [V- 786948]

Real Estate

FLAT FOR SALE

■ 3 BHK 1580 Sft. North / East Facing 2nd Floor, S.K.Residency, Nr. Rythu Bazar, Narashimhanagar, Akkayyapalem, Vizag. Asif Sharif. Ph : 83330 24756 [V- 6592]

HOUSE FOR SALE

■ విజయనగరం సిటీ పరిధిలో శ్రీకాకుళం రోడ్, రణస్థలంలో ఇండిపెండెంట్ ఇల్లులు 30 లక్షల నుండి, ఇళ్ళ స్థలాలు 100 గజాలు 5 లక్షల నుండి కలవు. బ్యాంక్‌లోన్, స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్ : 76819 79283, 88744 82518 [V- 823845]

■ VUDA 3 BHK Duplex Houses for Sale. 2400 Sft with Car Parking at Sujathanagar, Teachers layout. Contact 98482 15235, 0891-2558326. [V- 823843]

PLOT FOR SALE

■ VJA, రాజధాని అమరావతి, మంగళగిరి, గన్నవరం, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, నున్న నూజివీడు రోడ్డు, కంచికచర్లలో DTCP, AP CRDA ప్లాట్స్ చ॥గ॥ 1,900/- నుండి 12,900/- ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్. సంప్ర: 99085 66079 [B-107]

R/E WANTED

■ House No Rent, No Interest Lease 2BHK / 3BHK in Gopalapatnam. Ph: 7013347610, 9010144692 [HA-5677]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12678]

■ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంక్‌లో తనఖా ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. మిగిలిన డబ్బు తక్షణమే ఇవ్వబడును. స్పాట్ క్యాష్. EV Gold, Ph: 70750 86333. [V- 1320]

Wanted

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1185495]

■ వైజాగ్ ఎక్స్‌ప్రెస్ డైలీ న్యూస్ పేపర్‌కి జిల్లా, డివిజన్, మండల కేంద్రాలకు అనుభవం గల విలేకర్లు కావలెను. సంప్ర : 85004 59713, 88974 69303 [V- 823844]

■ Wanted DTP Operator (M/F) Telugu Typing Must. All in One Computer works. Office : Sri Deva Consultancy. Vepagunta. Ph : 88860 77750, 88855 55889 [V- 12791]

CHANGE OF NAME

I, MOHAMMED RAZAK, Resident of D.No. 18-13-19, Kummara Veedhi, Zanda Chettu, Maharanipeta, Visakhapatnam - 530001, AP. Have changed my name from MOHAMMAD RAZAK (Old Name) to MOHAMMED RAZAK (New Name), hence forth I am being Called as MOHAMMED RAZAK (New Name) for all purposes.

■ చెదల నివారణ సంస్థలో పనిచేయుటకు సర్వీస్ బాయ్స్ కావలెను, వెహికల్ తప్పనిసరి, అర్హత : 10th జీతం : రూ. 15,000/- ✆ 94945 69895 [B-716]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/ పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీ: 18K Ph: 9160900024/ 9640400073 [HA-796285]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి

మురళీనగర్, మాధవధార	: 90101 33346
NAD, కంచరపాలెం	: 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	: 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	: 90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ, MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	: 97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

రిటైల్ లెండింగ్ అండ్ పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీస్/బ్రాంచ్): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డి.నం.30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, 3వ అంతస్తు, గిగాప్లెక్స్, NPC-1, TTC ఇండస్ట్రియల్ ఏరియా, ముగల్సాన్ రోడ్, ఎయిరోలి, నవీ ముంబయి - 400708.
నమోదిత కార్యాలయం: "త్రిశూల్", 3వ అంతస్తు, సమర్థేశ్వర్ టెంపుల్ ఎదురుగా, లా గార్డెన్, ఎల్లిస్‌బ్రిడ్జ్, అహ్మదాబాద్ - 380006.

స్థిరాస్తి అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) (అమెండ్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 సబ్ రూల్ (6)కి నిబంధనతో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి బహిరంగ - వేలం అమ్మకం ప్రకటన.

శ్రీ నెమ్మల వికాస్ కుమార్ మరియు మరొకరి నుండి సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెల్లించాల్సిన బకాయి 20.09.2023 నాటికి మొత్తం రూ.88,48,971/- (ఎనభై ఎనిమిది లక్షల నలభై ఎనిమిది వేల తొమ్మిది వందల డెబ్బై ఒక్క రూపాయలు మాత్రమే)తో పాటు భవిష్యత్ వడ్డీ మరియు వ్యయాలను రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారిచే భౌతిక స్వాధీనం చేసుకున్నటువంటి, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/చార్జ్ చేసిన దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా", "ఏది ఉంటే అది" మరియు "అక్కడ ఏమున్నదో అదే" ప్రాతిపదికన 19 నవంబర్‌న విక్రయించబడునని సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీత(ల)కు మరియు గ్యారంటార్(ల)కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. అవసరమైన వివరాల కొరకు జతపరిచిన వేలం షెడ్యూలును చూడగలరు.

తెలిసిన తాకట్టు రుణభారాలు (ఏవేని)	లేవు
రిజర్వు ధర (రూ.లో)	రూ.1,17,20,000/- (ఒక కోటి పదిహేడు లక్షల ఇరవై వేల రూపాయలు మాత్రమే)
బయానా (రూ.లో)	రూ.11,72,000/- (పదకొండు లక్షల డెబ్బై రెండు వేల రూపాయలు మాత్రమే)
బిడ్ పెంపుదల మొత్తం	రూ.10,000/- (పది వేల రూపాయలు మాత్రమే)
బయానాతో పాటు బిడ్లు/ టెండరు దాఖలుకు చివరి తేది, సమయం మరియు ప్రదేశం	18 నవంబర్, 2024న సా.04:00 గం. వరకు. యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డి.నం.30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002. శ్రీ U రాంబాబు / B సుధీర్ గారికి అడ్రస్ చేయవలెను.
బహిరంగ ఇ-వేలం తేది, సమయం మరియు ప్రదేశం	19 నవంబర్, 2024న ఉ.11.00 గం. మరియు మ.12.00 గం. మధ్య, ప్రతీసారి 5 నిమిషాల అపరిమిత పొడిగింపులతో వెబ్ పోర్టల్ https://www.bankeauctions.comలో, ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లరేషన్ మొ॥వి కలిగిన ఇ-వేలం టెండరు డాక్యుమెంట్లు పైన తెలిపిన సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌సైట్‌లో లభ్యమగును.

తనఖా పెట్టిన ఆస్తి వివరాలు

షెడ్యూలు ఆస్తి వివరణ దిగువ విధంగా ఉన్నది :

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, గాజువాక మండలం SRO, కూర్మన్నపాలెం గ్రామం యొక్క E. ఆఫీస్ ఫైల్ నం.225755/2019 తేది: 06-02-2020లో GVMC ఎండార్స్‌మెంట్ ప్రకారం సర్వే నం.29/2Bలో మాతృశ్రీనగర్‌లో L.P.No.18/07, BLP No.1/93లో ప్లాట్ నం.133లోని 400 చ.గజాలు లేదా 333.33 చ.మీటర్ల విస్తీర్ణం సైట్ యావత్తు. **సరిహద్దులు : తూర్పు :** ప్లాట్ నం.134, **దక్షిణం :** 30 అడుగుల రోడ్, **పశ్చిమం:** ప్లాట్ నం.196 ఫేజ్-1, **ఉత్తరం:** సొసైటీ భూమి.

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం సెక్యూర్డ్ క్రెడిటార్ వెబ్‌సైట్ అనగా https://www.axisbank.com/auction-retailలో మరియు బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ M/s C1 India Private Limited వారి వెబ్ పోర్టల్ https://www.bankeauctions.comలో ఏర్పాటుచేసిన లింక్‌ను చూడండి.

బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ M/s C1 India Private Limited వారి వెబ్ పోర్టల్ https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్‌లో వేలం నిర్వహించబడును. ఏదేని ఇతర సహాయం కోసం కాబోరు బిడ్డర్లు శ్రీ U రాంబాబు / B సుధీర్ కుమార్, యాక్సిస్ బ్యాంక్, డి.నం.30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002 (మొబైల్ నం.7382922383/8885191821, ఇ-మెయిల్ ఐడి: uddangi1.rambabu@axisbank.com వారిని కార్యాలయ వేళలలో ఉ.9:30 గం. నుండి సా.4:00 గం. మధ్య సంప్రదించగలరు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) (అమెండ్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 సబ్ రూల్ (6) క్రింద రుణగ్రహీతలకు/ సహ-రుణగ్రహీతలకు/ గ్యారంటార్‌లకు ఈ నోటీసు 30 రోజుల నోటీసుగా పరిగణించబడును.

తేది: 22.10.2024
ప్రదేశం: విజయవాడ

సం/- అధీకృత అధికారి
యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్